**G7 అవుట్‌రీచ్ సెషన్‌లో ప్రసంగించిన ప్రధాన మంత్రి (జూన్ 17, 2025)**

జూన్ 18, 2025

కననాస్కిస్‌లో G7 సదస్సు యొక్క అవుట్‌రీచ్ సెషన్‌లో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు పాల్గొన్నారు. 'ఇంధన భద్రత: మారుతున్న ప్రపంచంలో అందరికీ అందుబాటులో ఉంచడానికి మరియు తక్కువ ధర వద్ద అందించడానికి వివిధీకరణ, సాంకేతికత మరియు మౌలిక సదుపాయాలు' అనే సమావేశాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఆహ్వానం పంపిన కెనడా ప్రధాన మంత్రి గౌరవనీయులు శ్రీ మార్క్ కార్నీకి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు మరియు 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న G7 ని ఆయన అభినందించారు.

2. తన ప్రసంగంలో, భవిష్యత్ తరాలు ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లలో ఇంధన భద్రత ఒకటని ప్రధానమంత్రి నొక్కి చెప్పారు. భారతదేశం సమగ్ర అభివృద్ధి పట్ల నిబద్ధత గురించి వివరిస్తూ లభ్యత, సులభత, అందుబాటులో ఉండే ధర మరియు ఆమోదయోగ్యత అనే సూత్రాల పై భారతదేశం ఇంధన భద్రత ఆధారపడి ఉంది అని ఆయన పేర్కొన్నారు. భారతదేశం ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ అయినప్పటికీ, పారిస్ నిబద్ధతలను పేర్కొనబడిన సమయం కంటే ముందుగానే విజయవంతంగా నెరవేర్చిందని ఆయన ప్రముఖంగా పేర్కొన్నారు. ఒక సుస్థిరమైన మరియు హరిత భవిష్యత్తు కోసం భారతదేశం యొక్క నిబద్ధతను ప్రముఖంగా ప్రస్తావిస్తూ అంతర్జాతీయ సౌర కూటమి, విపత్తు నిర్వహణ మౌలిక సదుపాయాల కోసం కూటమి, గ్లోబల్ బయోఫ్యూయల్స్ అలయన్స్, మిషన్ లైఫ్ మరియు వన్ సన్-వన్ వరల్డ్- వన్ గ్రిడ్ వంటి అనేక అంతర్జాతీయ కార్యక్రమాలను భారతదేశం చేపట్టిందని ఆయన పేర్కొన్నారు మరియు వాటిని మరింత బలోపేతం చేయమని అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చారు.

3. ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు మరియు సంఘర్షణలు దక్షిణార్ధ గోళ దేశాల పై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి అని ప్రధాన మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు మరియు అంతర్జాతీయ వేదికలపై దక్షిణార్ధ గోళ దేశాల వాణిని వినిపించే బాధ్యతను భారతదేశం తీసుకుంది అని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ సమాజానికి ఒక సుస్థిరమైన భవిష్యత్తు పట్ల నిబద్ధత ఉంటే దక్షిణార్ధ

గోళ దేశాల ప్రాధాన్యతలు మరియు ఆందోళనలను అర్థం చేసుకోవడం ప్రపంచానికి ముఖ్యం అని ఆయన నొక్కిచెప్పారు. భద్రతా సవాళ్ల గురించి పేర్కొంటూ ఉగ్రవాదం పై ప్రపంచ పోరాటాన్ని బలోపేతం చేయాలని ఆయన దేశాలకు పిలుపునిచ్చారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాటంలో భారతదేశానికి బలమైన మద్దతును అందించినందుకు అంతర్జాతీయ సమాజానికి ధన్యవాదాలు తెలియజేస్తూ, పహల్గామ్ ఉగ్రవాద దాడి భారతదేశంపై మాత్రమే కాకుండా మొత్తం మానవజాతిపై దాడి అని ఆయన పేర్కొన్నారు. ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చే మరియు ప్రోత్సహించే దేశాలపై కఠినమైన చర్య కోసం ఆయన పిలుపునిచ్చారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ద్వంద్వ ప్రమాణాలు ఉండకూడదని, ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చే వారికి ఎప్పుడూ సహకరించకూడదు అని ఆయన పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని మానవజాతికి అతిపెద్ద ప్రమాదంగా పేర్కొంటూ ప్రధాన మంత్రి అంతర్జాతీయ సమాజానికి కొన్ని ముఖ్యమైన ప్రశ్నలు వేశారు :

-తాము బాధితులు అయినప్పుడు మాత్రమే దేశాలకు ఉగ్రవాదం వలన ఏర్పడే ప్రమాదం అర్థం అవుతుందా ?

-ఉగ్రవాదానికి పాల్పడేవారిని, దాని బాధితులను సమానంగా ఎలా చూస్తారు ?

-అంతర్జాతీయ సంస్థలు ఉగ్రవాదానికి మౌన ప్రేక్షకులుగా ఉంటారా ?

4. సాంకేతికత, AI మరియు ఇంధనం మధ్య ఉన్న సంబంధాన్ని గురించి కూడా ప్రధానమంత్రి మాట్లాడారు. సామర్థ్యం మరియు ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి AI ఒక కీలకమైన సాధనంగా మారినప్పటికీ, ఆ సాంకేతికతకు కావలసిన శక్తి చాలా ఎక్కువ అని మరియు శుభ్రమైన, పర్యావరణ అనుకూల కార్యక్రమాల ద్వారా దానిని ఎలా స్థిరంగా మార్చాలో వ్యూహరచన చేయడం ముఖ్యమని పేర్కొన్నారు. సాంకేతికతను ప్రోత్సహించడానికి భారతదేశంలో మానవ-కేంద్రీకృత విధానాన్ని వివరిస్తూ, ఏదైనా సాంకేతికత ప్రభావవంతంగా ఉండాలంటే సామాన్య ప్రజల జీవితాలకు విలువను తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు. AI సమస్యలను ఎదుర్కోవడానికి మరియు ఆ రంగంలో ఆవిష్కరణను ప్రోత్సహించడానికి AI సంబంధిత ప్రపంచ పరిపాలన సమస్యలను పరిష్కరించడం కీలకం అని ఆయన

సూచించారు.  AI యుగంలో కీలకమైన ఖనిజాలు సురక్షితమైన మరియు స్థిరమైన సరఫరా గొలుసులు కలిగి ఉండడం ముఖ్యం అని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు.  భారతదేశంలో ఉన్న నాణ్యమైన మరియు వైవిధ్యమైన డేటా బాధ్యతాయుతమైన AI కోసం కీలకమైనది అని ప్రధాన మంత్రి అన్నారు.

5. ఒక సుస్థిరమైన భవిష్యత్తును సాధించడానికి సాంకేతికత ఆధారిత ప్రపంచం మరింత సన్నిహితంగా సహకరించుకోవాలి  మరియు దానిని సాధించేందుకు ప్రజలు మరియు భూమికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి అని ప్రధాన మంత్రి పేర్కొన్నారు.  సమావేశంలో ప్రధాన మంత్రి ప్రసంగాన్ని ఇక్కడ చూడవచ్చు [Link]

కననాస్కిస్

జూన్ 17, 2025